కథ

# పతాకశీర్షిక

గోపరాజు నారాయణరావు

*స్పిరిట్‌లో ముంచిన దూదిపెట్టి గాయంమీద తుడిచినట్టయింది ఆ ఊహకి. ఒక్కసారి ఉలికిపడ్డాను. అదేమిటో, ఎంత అదుపు చేద్దామన్నా ఇంకా ఇంకా స్పష్టంగా రూపు కట్టించాలని మనసు పాకులాడుతుంది ఆ ఊహనే.*

*'ఎలా మింగాడో విషం? నవనాడులని మృత్యుస్పర్శ ఆవహిస్తూ వుంటే ఆ మనసులో ఎన్ని అగ్నిపర్వతాలు పేలాయో?'*

చైర్‌లో ఇబ్బందిగా కదిలాను. టైం చూశాను. మూడున్నర అవుతోంది. ఆఫీసు బిజీ అవుతున్నదప్పుడే.

పక్క కేబిన్‌లో అన్ని ఎలక్ట్రానిక్ టెలీ ప్రింటర్ల శబ్దం ఈ కేబిన్‌లోకి వినిపిస్తోంది. అద్దం నుంచి యథాలాపంగా బయటకి చూశాను. టెలీప్రింటర్ కాపీలు ఇస్తూ స్పోర్ట్స్ సబెడిటర్ నరేంద్రతో ఏదో చర్చిస్తున్నాడు న్యూసెడిటర్ శేఖర్.

ఇందాక బోయ్ తెచ్చి నా టేబుల్ మీద పడేసిన తెలుగు డైలీలు ఒక్కొక్కటే తీసి ఆబగా చదువుతూనే ఉన్నాడు రాజయ్య. క్రైం కాలమ్ కాబోలు. సీరియస్‌గా మునిగిపోయాడు. ఎంత ఆసక్తిగా చదువుతున్నాడంటే నాలుకని, గొంతును కాలుస్తున్నా అలాగే సిప్ చేస్తున్నాడు అంత వేడివేడి టీని.

'గొంతులోకి ఒలికిన పురుగుమందునీ ఇలాగే గుటకేసి వుంటాడా?'

మళ్లీ అలాంటి ఊహ, అలాంటి ప్రశ్నే.

దృష్టిని బలవంతంగా ఫైలులోకి మళ్లించాడు. ఎదురుగా టేబుల్‌పైనే పరిచివుంది. క్లిప్పింగుల ఫైలు. వాటిని తిప్పడం మొదలుపెట్టాను.

"సార్! టీ చల్లారిపోతుంది!" గుర్తుచేశాడు డిస్ట్రిక్ట్ రిపోర్టర్ యుగంధర్. రాజయ్య, యుగంధర్ నా ఎదురుగానే కూర్చున్నారు, పక్కపక్క కుర్చీలలో. అసోసియేట్ ఎడిటర్‌ని చెప్పాను కదా అని రాజయ్యని వెంటబెట్టుకొచ్చాడు యుగంధర్. రాజయ్యని ఇంటర్వ్యూ చేసి మంచి హ్యూమన్ ఇంటరెస్ట్ న్యూస్ స్టోరీ రాయాలని నా కోరిక.




అసలు మనిషే అంత, లేకపోతే మాసిన గడ్డం వల్లనో మరి, రాజయ్య ముఖంలో ఓ రకమైన మెలాంకలీ జాడ. గోపీచంద్ మమకారం కథలో రైతు గుర్తొచ్చాడు. నిజమే. కొంత దైన్యాన్ని అక్షరాల మధ్య విడిచివచ్చిన రైతుపాత్రకి ప్రతిరూపంలాగే వున్నాడు. ముప్పయి

అయిదేళ్లుంటాయి. బట్టతల వయసుకు మించిన పెద్దరికం తెచ్చిపెడుతోంది.

తీరా పిలిపించానే గాని, రాజయ్యని ఏమాట అడగాలన్నా ఏదో సందేహం. ఏ ప్రశ్న ఏ గాయాన్ని రేపుతుందోనన్న సంకోచం.

చచ్చిబతికాడు రాజయ్య...

ఆరోజు అన్నిపత్రికలలోను ఆ వార్తే. ఎనిమిది మంది రైతులు పురుగుమందు తాగేశారు ఒక్కరోజునే. పైగా పత్తిరైతుల ఆత్మహత్యల పేరు పడిపోయిన వరంగల్ జిల్లాలోనే ఇది జరిగింది. ఏడుగురు ప్రాణాలు వదిలేశారు. యాంకర్‌గానో, బాక్సులు కట్టో రాష్ట్రంలోని అన్ని పత్రికలు ఈ వార్తనే ఫోటోలతో మొదటి పేజీలో ప్రచురించాయి. తెల్లటిగుడ్డలతో చుట్టిన రైతుల శవాలు తడిసిపోయిన దూదిగుట్టల్లా కనిపిస్తున్నాయి ఫోటోలలో. వాటిమీద పడి రోదిస్తున్నారు భార్యాపిల్లలు. పక్కనే 'మృత్యుంజయుడు' పేరుతో ఇంకో వార్త. ఎనమండుగురిలో బతికి బట్టకట్టిన రైతు గురించే అది. అతడే రాజయ్య. మూడేళ్ల క్రితం ఆదర్శరైతు అవార్డుతో గ్రామానికి వచ్చిన రాజయ్య ఇప్పుడు ఇలా పురుగుమందు తాగేసి పొలంగట్టున కొనప్రాణంతో వుంటే గ్రామం మొత్తం కదిలివెళ్లింది. చావు నుంచి తప్పించింది.

ఇది చదివాకే, దీనిమీద మంచి వార్తాకథనం రాయాలనిపించింది.

ఒకరా, ఇద్దరా? వందలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు - 1997లో 1998లో. ఆ తరువాత... పంటకు పట్టిన చీడపీడలని వదిలించలేకపోయినా, రైతు ప్రాణం తీయడం దగ్గర మాత్రం నిక్కచ్చిగానే పనిచేసింది కల్తీపురుగుమందు. అప్పుడు రైతుల బలవంతపు మరణం వార్తలేని రోజే లేదు న్యూస్‌పేపర్లలో. క్యాలెండర్‌లో ప్రతితేదీ మీదా కనీసం ఒక రైతు మృతదేహమైనా వేలాడుతూ కనిపిస్తుంది.

పత్రికల నుంచి శ్రద్ధగా కత్తిరించిన క్లిప్పింగ్స్‌ని బ్రౌన్‌షీట్ల మీద అంటించారు. పతాక శీర్షికలు, యాంకర్ స్టోరీలు, ఆదివారం అనుబంధం కథనాలు, స్పెషల్ స్టోరీలు, విశ్లేషణలు, తెలుగులో వచ్చినవి, ఇంగ్లీషు డైలీలు, మ్యాగజైన్లు ప్రచురించిన వార్తలు, వ్యాసాలు జాగ్రత్తగా ఫైల్ చేసిపెట్టారు.

"తమాషా ఏమిటంటే సార్! వీళ్లకి విత్తనాలు సప్లై చేసిందీ, ఉచిత సలహాలిచ్చిందీ అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్ వాళ్లే. జరగాల్సిందంతా జరిగిపోయాక ఇప్పుడూ, అసలు మేం పంట మార్పిడి గురించే ముందు నుంచీ చెబుతున్నాం, రైతులే వినకుండా ఇలా ప్రాణాల మీదకి తెచ్చుకున్నారంటున్నారు సార్!"

ఈ విషాదం గురించి ఇలాగే ఏదో ఒకటి గుర్తు చేస్తూనే వున్నాడు యుగంధర్.

"కోట్లు పోశారు సార్ పురుగుమందుకి. వరంగల్ జిల్లా పురుగుమందు వాసన కొట్టింది. గాలంతా ఆ వాసనే. దీనికి ఆఫీసర్ల భాష్యమే మరీ అన్యాయం. ప్రకాశం, గుంటూరు పొగాకు రైతుల్లాగ కోటీశ్వర్లయిపోదామని ఈ రైతులు పత్తిపొలాలని మందులతో నింపేశారట సార్!"

ఇంకా గుర్తుంది నాకు. 1997 డిసెంబర్ మాసం. వరంగల్ జిల్లాలోనే ఎలుకుర్తి హవేలీలో మొదటిసారి పత్తిరైతు ఆత్మహత్య సంఘటన జరిగింది. ఆ రైతుపేరు కిషన్. యుగంధర్ రిపోర్ట్ చేశాడు. ఆ తర్వాత అక్కడే ఇంచుమించు నూటఅరవై దాకా జరిగిన రైతుల బలవంతపు మరణాలన్నింటినీ క్రమం తప్పకుండా పేపరు కిచ్చాడు. ఇవే కాదు అటు రాయలసీమలోను, ఇటు కోస్తాలో కూడా రైతన్నల ఆత్మహత్యలు రిపోర్టయ్యాయి. అవి రైతు జనహరణ నామ సంవత్సరాలేమో అన్నట్టు అప్పుడే, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటకలలో కూడా రైతులు ఆత్మహత్యలకి పాల్పడ్డారు. ఆఖరికి మన రెంటచింతల రైతులు ఢిల్లీ ఆస్పత్రిలో కిడ్నీలు అమ్ముకుని ఒక దశాబ్దంగా అప్పులు తీర్చుతున్న వైనాలు, అన్నీ ఫైలు నిండా కనిపిస్తున్నాయి.

వాళ్లిద్దరి సంగతికూడా మరిచిపోయి క్లిప్పింగ్స్ చూస్తున్నాను. రెడ్‌అవ్‌లైనర్‌తో ఆ పెద్ద క్లిప్పింగ్‌లోని వాక్యాలని మార్క్ చేశారెవరో. 'ఊహాతీతంగా 1987లో ప్రకాశం జిల్లాలో 47 మంది పత్తిరైతులు ఆత్మహత్య చేసుకుంటే ఆందోళన చెందాం. 1997 నవంబర్‌నుంచి ఇప్పటి (మార్చి'98) వరకు 250 మంది ఆత్మహత్య చేసుకున్నారు...' ఈ క్లిప్పింగ్ తిప్పగానే మరొకటి 'కిల్లింగ్ ఫీల్డ్స్' హెడ్డింగ్‌తో. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఆనాడే వందమంది రైతులు ప్రాణాలు తీసుకున్నారట. ఆ వివరాలన్నీ ఇచ్చారు.

వేళ్లమధ్య నుంచి ఒక్కో క్లిప్పింగు తిరిగిపోతోంది..

'11 రోజులలో 11మంది రైతుల ఆత్మహత్య ఏ రోజుదో ఈ వార్త అనుకుంటూ వెతికాను. 1997 డిసెంబర్ 26న ఈ వార్త ప్రచురించింది. అంటే రోజుకో ఆత్మహత్య. పక్కనే, హైదరాబాద్ డేట్‌లైన్‌తో ఇంకొకటి 'ఆరుగురు రైతుల ఆత్మహత్య'

*ఒకరా, ఇద్దరా? వందలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు - 1997లో 1998లో. ఆ తరువాత... పంటకు పట్టిన చీడపీడలని వదిలించలేకపోయినా, రైతు ప్రాణం తీయడం దగ్గర మాత్రం నిక్కచ్చిగానే పనిచేసింది కల్తీపురుగుమందు. అప్పుడు రైతుల బలవంతపు మరణం వార్తలేని రోజే లేదు న్యూస్‌పేపర్లలో. క్యాలెండర్‌లో ప్రతితేదీ మీదా కనీసం ఒక రైతు మృతదేహమైనా వేలాడుతూ కనిపిస్తుంది.*



అని.

ఫిబ్రవరి 9: రాష్ట్రంలో గత ఇరవై నాలుగుగంటల్లో ఆరుగురు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు... రాగల ఇరవైనాలుగు గంటల్లో వ్యవసాయదారులకి వాతావరణ సూచన చేయడానికి బదులు, రైతుల చావుల గురించి నివేదించవలసిన స్థితికి చేరుకుంది ఆంధ్రదేశం.

ఆ ఫిబ్రవరే కాదు. దానికి ముందు 1998 జనవరి నుంచే బలవంతపు మరణాల పరంపర కనిపిస్తోంది. ఈ జనవరి నెలదే చిన్న క్లిప్పింగ్, మధ్యప్రదేశ్‌ది. 'పంట నష్టానికి పరిహారం కోరుతూ అక్కడ ఆందోళన చేస్తున్న రైతుల మీద పోలీసులు కాల్పులు జరిపారట. పదమూడు మంది చనిపోయారు.

పత్తిరైతు, ధాన్యంరైతు, వేరుశెనగ రైతు, ఆత్మహత్యని ఆశ్రయించినవారే...

'మరో ముగ్గురు రైతుల ఆత్మహత్య...' కలక్టరేట్‌లో రైతు ఆత్మహత్య... ఆరుగురు రైతుల ఆత్మహత్య, ఆరు జిల్లాల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్య... ముఖ్యమంత్రి దర్శనం దొరక్క వృద్ధరైతు ఆత్మాహుతియత్నం... ఏపి, కర్ణాటక అండ్ నౌ మహారాష్ట్ర. రైతస్ కిల్ దెమ్ సెల్వ్స్.... ఇవన్నీ ఒక ఎత్తు. అప్పుడే ఓ పత్రిక పబ్లిష్ చేసిన ఈ బాక్స్ ఐటం ఒక్కటీ ఒక ఎత్తు. అదే 177కు చేరుకున్న రైతుల ఆత్మహత్యలు.

హైదరాబాద్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో గత రెండు నెలల నుంచి కొనసాగుతున్న పత్తి, మిరప, పొగాకు, కంది రైతుల ఆత్మహత్యలు నేటికి 177కు చేరుకున్నాయి. దుబాసి రాజయ్య... నెల్లుట్ల రవి... బండి కళావతి.... మాశెట్టి భూమన్న... అజ్మీరా శంకర్...

దూదిపింజలై పోయాయి రైతుల ప్రాణాలు.

వందల వందల క్లిప్పింగ్‌లు... చావు వార్తలు.

కొంచెం తిప్పితే కడుపు మండించే క్లిప్పింగులు రెండు ఒకదాని తరువాత మరొకటి...

అన్నపూర్ణ ఇంటిలో నాలుగువందలకి చేరిపోయింది రైతుల మరణాల సంఖ్య. ఇక్కడ లేచిన శవాల గురించి పత్రికలు చెబుతున్నాయి. కానీ ఆశ్చర్యం. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి వ్యవసాయమంత్రిగారు సమర్పించిన జాబితాలో 149 మంది మాత్రమే ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఈ సభకంటే లోక్‌సభ మరీ పెద్దది కదా! అక్కడ ఇంకా పెద్ద ముచ్చట జరిగింది. ఆ నాలుగు వందల ప్రాణాలు గురించి అక్కడా చర్చకు వచ్చింది. తీరా చర్చ మొదలయ్యే సరికి నాలుగు ముక్కలు మాట్లాడడానికి రాష్ట్ర ఎంపీలు పదుగురు కూడా లేకపోయారు. అసలు దేశం మొత్తంమీద జరిగిన ఆరేడువందల రైతుల ఆత్మహత్యల గురించి కూడా చర్చ జరగాలి. కానీ కోరం లేక చర్చ కాసేపు చతికిల పడింది. 'రైతుల ఆత్మహత్యలపై కాంగ్రెస్, టిడిపి అనాసక్తి: కోరం లేని లోక్‌సభ' అన్ని పత్రికలు దాదాపు ఇదే హెడ్డింగ్‌తో వార్త రాశాయి. స్వతంత్రభారత చట్ట సభా చరితంలో తప్పకుండా చేరాల్సిన ఆ తారీఖు ఏది అని చూశాను. అదే జూన్ 1, 1998. 'రాష్ట్ర ఎంపీల దారుణ వైఖరి' అంటూ వాటి వెనకే వుంది. ఓ ఆక్రోశభరిత సంపాదకీయం.

అలా తిరిగిపోతూ వున్నాయి షీట్లు.

'ఇదంతా మాస్ హిస్టీరియా...' ప్రభుత్వం ఇచ్చే లక్షరూపాయాల ఎక్స్‌గ్రేషియా కోసం రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారా? రైతుల ఆత్మహత్యలు గ్లోబలైజేషన్...

ఈ సమాచారంతో న్యూస్ స్టోరీ రాయాలి. రొటీన్‌గా కాకుండా దానికి రాజయ్య అనుభవాన్ని జోడించాలి. అదీ నా ఉద్దేశం.

నేను, యుగంధర్ రకరకాలుగా ప్రశ్నలు వేశాం.

చివర్న యుగంధరే అడిగాడు. 'రైతంటే ఈ దేశపు వెన్నెముక. అలాంటి రైతుకి ఆత్మహత్య చేసుకోవాలన్న చచ్చు తలంపు ఎందుకొస్తుంది? ఎలా వస్తోంది?' అని.

రొటీన్ ప్రశ్నే. కాస్త చనువుగా అడిగాడు. కాని, సాంఘికంగా, ఆర్థికంగా, చారిత్రకంగా రైతాంగానికి వున్న శక్తి, స్థానం మాటేమిటన్న ధ్వని అందులో ఉంది. దీనికి సమాధానంగా కొన్ని మాటలు మాత్రం అన్నాడు రాజయ్య. వాటిని చాలా అలవోకగా అనేశాడు గాని, నిజానికి ప్రాణాలు తీసుకున్న రైతుల తుదిశ్వాసల్లోని మౌనవేదనకి గొంతు ఇచ్చినట్టనిపించింది అవి వింటూ వుంటే. ఈ మాటలతోనే న్యూస్‌స్టోరీ ప్రారంభించాలని కూడా వెంటనే అనుకున్నాను.

ఇంటర్వ్యూలో ఉపయోగించడానికి ఫోటో తీయించి రాజయ్యని పంపేశాను. లైబ్రరీలో ఇంకో రెండురోజులు వెదికి మరికొంత సమాచారం కూడా సేకరించాను.

కాని, రాయడం మాత్రం కుదరలేదు.

కారణం జయలలిత. ఆవిడే, అన్నా డిఎంకె అధినేత్రి జయ పురచ్చితలైవి...

ఆ రోజు ఇంటర్‌కమ్‌లో పిలిచాడు ఎడిటర్ గారు. ఆయన చాంబర్‌లోకి అడుగుపెడుతూ వుండగానే కొంపమునిగినట్టు అన్నారు.

"వాజ్‌పేయ్ గవర్నమెంట్‌కి జయలలిత గుడ్‌బై చెప్పేసిందండి!"

"ఇందాక టీవీలో ఫ్లాష్ చూశాను సార్!"

"చూశారా? సరిసరి. ఏమిటో అనుకున్నాం.

## గర్భనిరోధక మాత్రలు వాడే వారికి హెచ్చరిక



మామూలుగానైతే మహిళలు గర్భనిరోధకమాత్రలు వాడితే ఇబ్బంది లేదు. కానీ ఏదైనా ఆపరేషన్, సర్జరీ జరిగిన మహిళలు దాదాపు నెల రోజుల వరకూ వీటిని వాడకూడదంటున్నారు విజ్ఞానవేత్తలు. ఎందుకంటే ఆపరేషన్ అయినవారికి మామూలుగానే రక్తం గడ్డ కట్టే అవకాశం వుందట. గర్భనిరోధకమాత్రలు వాడే వారిలో ఇది ఇంకా ఎక్కువవుతుందట. అందుకని ఆపరేషన్ తాలూకు గాయం పూర్తిగా మానిపోయేంతవరకూ ఈ మాత్రలు వాడకూడదు. మాత్రలకు బదులుగా వేరే దారులు చూసుకోవటం మేలంటున్నారు వైద్యులు.

ఎస్.

ఇక్కడ ప్రభుత్వాలు కూలిపోడానికి ఉద్యమాలు, ప్రజామద్దతులు అవసరం లేదని, కేవలం డిన్నర్లూ, పార్టీలు చాలని రుజువు చేశాడండి సుబ్రహ్మణ్యస్వామి. జస్ట్... డిన్నరు పేరుతో జయని, సోనియాని కలిపాడు. వాజ్‌పాయ్‌ని దించేశాడండీ ప్రొఫెసర్ స్వామి. విశ్వాస తీర్మానం గొడవ ఒకటుందనుకోండి! ఏది ఎటొచ్చినా, మీరు వెంటనే సంకీర్ణ ప్రభుత్వాల మీద ఓ న్యూస్‌స్టోరీ రెడీ చేసెయ్యండి!"

ఏం చెప్పాలో తోచలేదు నాకు.

"కనీసం ఎల్లుండికయినా అది నాకివ్వాలి" మళ్లీ అన్నారాయన.

"సార్...! రైతుల ఆత్మహత్యల మీద స్టోరీ మొదలుపెట్టాను. రెండ్రోజులు తర్వాత...."

"ఇప్పుడవన్నీ పెట్టుకుంటే ఎలా? అయినా, ఆ ఆత్మహత్యలు ఇప్పట్లో ఆగేవి కాదు. ముందు ఇది రాసెయ్యండి. ఓకే. మొదటి సంకీర్ణం కాబట్టి జనతా ప్రభుత్వంతోనే మొదలుపెట్టండి. చౌదురి చరణ్‌సింగ్ గారి నాలుగు వారాల వైభోగం గురించి కాస్త రాయండి, చాలు. వివరంగా ఇవ్వాల్సింది 1997 నుంచే లెండి..."

రైతుల ఆత్మహత్యలు వెనక్కు పోయాయి. రాజకీయ ఆత్మహత్యలు ముందుకొచ్చాయి.

మళ్లీ లైబ్రరీలో పడి తిరగెయ్యడం మొదలుపెట్టాను. అవే పేపర్లు, అవే మ్యాగజయిన్లు, వాటి మీద సంవత్సరాలూ అవే.

నెమ్మదిగా ఆ గందరగోళమంతా గుర్తుకొస్తున్నది.

అదేదో పిల్లల కథలో కోతిపాడే 'కత్తిపోయి డాలూ వచ్చే ఢాం ఢాం ఢాం' పాటల సాగుతుంది ఈ సంకీర్ణ సర్కార్ల భాగోతం.

బయట నుంచి మద్దతు లేదు కాబట్టి సంకీర్ణం సాగిపోగలదని భావించాలా? భావించరాదా? అని పరిశీలకులు మళ్లీ మల్లగుల్లాలు పడుతూ వుండగానే ప్రభుత్వం పడిపోయింది. ఇక్కడి ప్రభుత్వాలు బయట నుంచి మద్దతు పీడతోనే కాదు, లోపలి మద్దతు బాధతో కూడా కుప్పకూలిపోగలదని లోపలి భాగస్వామి జయలలితగారు నిరూపించారు. నలభై ఎనిమిది సూట్‌కేస్‌లతో ఢిల్లీ వచ్చిన జయ రెండు కోర్కెలు కోరింది. బర్తరఫ్ అయిపోయిన నౌకాదళ చీఫ్ అడ్మిరల్ విష్ణుభగత్‌ను తిరిగి నియమించడం, రక్షణమంత్రి జార్జి ఫెర్నాండెజ్‌ను పీకెయ్యడం. ఈ కోర్కెలు తీరేవేనా? కాదని ఆమెకూ తెలుసు. వాజ్‌పేయి మళ్లీ మాజీ అయ్యారు. ఎన్నికల సంఘం మళ్లీ ఎన్నికలు జరిపింది. భారత ఓటర్లు ఓపిగ్గా ఓట్లేశారు. మళ్లీ. నాలుగేళ్లలో వాజ్‌పేయి ముచ్చటగా మూడోసారి ప్రధాని అయ్యారు. సంకీర్ణ కథకి ఇంటర్వెల్ దొరికింది.

నిజానికి ఈ పరిణామలని, ప్రహసనాలని విశ్లేషించాలంటే, వ్యాఖ్యానించాలంటే మామూలు విషయం కాదు. గిరీశమో, జంఘాల శాస్త్రో కావాలి. ఏమైనా, అన్నాడిఎంకె మద్దతు ఉపసంహరించుకోవడం దగ్గరునుంచి, అవిశ్వాస తీర్మానం, వాదోపవాదాలు, ఓటింగు, రాజీనామాలు కళ్లకు కట్టినట్టు చూపించింది మీడియా. పత్రికలు, టీవీలు పోటీ పడ్డాయి. ఆ తర్వాత ఎన్నికల గురించి, వాటి కవరేజ్ గురించి చెప్పక్కర్లేదు.

ఆ రోజు అన్ని పేపర్ల ఫైళ్లు ముందేసుకుని 14వ లోక్‌సభ కవరేజ్‌ని టాలీ చేస్తున్నాను తాపీగా.

అప్పుడు తెచ్చి ఇచ్చాడు మా సీనియర్ ఫోటోగ్రాఫర్ సుబ్బు రెండు ఫోటోలు ఒక వ్యక్తివే. రెండు భంగిమలలో ఉన్నాయి. ఓ లిప్తకుగాని గుర్తుపట్టలేకపోయాను. దాదాపు నెలల కింద చూసిన మొఖం, ఫైళ్లు మూసి ఆలోచిస్తున్నాను.

'హేట్సాఫ్... నిజంగా హేట్సాఫ్' అనుకున్నాను ఆ ఫోటోలను చూస్తూ.


సెక్యులరిజం రక్షణకి ఇక్కడ ప్రభుత్వాలు కూలతాయి. లేదా, ప్రభుత్వాలని పడగొట్టదలచినపుడు సెక్యులరిజం రక్షణ గురించి గుర్తుకొస్తుందనుకున్నా ఫరవాలేదు. బర్తరఫ్ అయిన అధికారులకి న్యాయం జరగలేదని ఏ ఒక్కనేతకి అనిపించినా అంతే. అందుకే మన ప్రజాస్వామ్యానికి హేట్సాఫ్. కాని, ఆరేడు వందల రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వం చేత కాదు గదా, కనీసం ఒక ఎంపీ చేతనో, ఒక ఎమ్మెల్యే చేతనో రాజీనామా కూడా చేయించలేవు. ఎందుచేతనో?

రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నాడు? అని ఆ రోజున మేము అడిగిన ప్రశ్నకు చచ్చిబతికిన రాజయ్య ఇచ్చిన సమాధానం గుర్తుకొస్తున్నది..

"... రైతాంగం బతికే వుందన్న సంగతి ఎవరికైనా గుర్తుందంటారా? గుర్తులేదు సారూ! ఇప్పుడు రైతు ఎంత నిస్సహాయుడంటే వాడు బతికున్న సంగతి చచ్చిపోవడం ద్వారా అయినా లోకానికి తెలుస్తుందేమోనన్న స్థితికి వచ్చాడు. తన ప్రాణం ఉనికిని చావుతో ప్రకటిస్తున్నాడు రైతు..."

ఈ మాటలనే పదేపదే చెబుతున్నట్టున్నాయి. నా చేతిలో వున్న రాజయ్య ఫోటోలు.

■



## టొమాటోలు తీసుకోండి!

మామూలుగా టొమాటో అంటే చులకనే. రోజా వాడుకునేవే కాబట్టి పెద్దగా వాటిని పట్టించుకోము. కానీ టొమాటో వల్ల మనకు చాలా మేలు జరుగుతుంది. స్కాట్లండ్‌లోని పరిశోధకుల ప్రకారం టొమాటోలో పీ-3 అనే రసాయనం వుందట. ఇది రక్తంలోని ప్లేట్‌లెట్లు కలిసిపోయి గందరగోళం కాకుండా చూస్తుంది. రక్తం గడ్డలు కట్టకుండా కూడా కాపాడుతుంది. టొమాటోలు రోజా తీసుకోవటం వల్ల హృదయసంబంధవ్యాధులు వచ్చే అవకాశాలు కూడా తగ్గుతాయుంటున్నారు నిపుణులు. ఉదయమే ఒక పండిన టొమాటో పరగడుపున తీసుకుంటే స్థూలకాయం కూడా తగ్గుతుందట. చవకగా దొరికేదే కాబట్టి అందరూ వాడుకోవచ్చు.

ఎస్.